క్లుప్తంగా

మృతుని కుటుంబానికి గొల్లపల్లి పరామర్శ



విద్యాసాగర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: విదేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సఖినేటిపల్లి పాలేనికి చెందిన నేతల విద్యాసాగర్(41) ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. ఉపాధి రీత్యా అబుదాబిలో నివాసం ఉంటున్న విద్యాసాగర్ ఆ దేశంలో ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన తండ్రి వసంతరెడ్డిని గొల్లపల్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మాజీ సర్పంచ్‌లు బళ్ల నోబుల్ ప్రభాకర్, ఈద రవిరెడ్డి, నాయకులు కుసుమ చంద్రశేఖర్, నల్లి ప్రేమానందం, తాడి సహదేవ్ ఉన్నారు.

ధన్వంతరి జయంతి వేడుకలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఉన్న ఆరోగ్య ప్రదాత, దేవ వైద్యుడిగా భాసిల్లుతున్న ధన్వంతరి స్వామి జయంతి గురువారం వైభవంగా జరిగింది. కార్తిక బహుళ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఆలయ ముఖ మండపంలో ద్విభాష్యం వెంకటసూర్య, సుజన దంపతులతో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

పీహెచ్‌సీకి నిధులు మంజూరు చేయాలి

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం పీహెచ్‌సీకి నిధులు మంజూరు చేయాలని బీజేపీ బిల్డింగ్ వర్కర్స్ సెల్ కన్వీనర్ చిట్టినీడి రంగసాయి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. నరేంద్రపురంలో వైద్యుడు, సిబ్బందితో పాటు, భవన నిర్మాణానికి స్థలం అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. 12 గ్రామాల ప్రజలకు సేవలందించే నరేంద్రపురంలో పీహెచ్‌సీ సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు రంగసాయి తెలిపారు.

రీ డిప్లాయ్‌మెంట్‌ను రద్దు చేయాలి

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సెకండ్ ఏఎన్ఎం నీరజను ప్రభుత్వమే ఆదుకోవడంతో పాటు, అందుకు కారణమైన రీ డిప్లాయ్‌మెంట్‌ను రద్దు చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఆరోగ్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు. స్థానిక పీహెచ్‌సీల్లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం జిల్లాలోని రామభద్రపురంలో ఇటీవల విధి నిర్వహణకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల అవుట్ సోర్సింగ్ విధానంలో అరకొర వేతనాలతో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను ఇష్టానుసారం బదిలీ చేసి పరిభారం పెంచేశారని మండిపడ్డారు. ఇకనైనా వైద్యారోగ్య శాఖ అధికారులు సత్వరమే రీ డిప్లాయిమెంట్‌ను రద్దు చేసి, రెండో ఏఎన్ఎంలను పూర్వ స్థానాలకు పంపాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆలమూరు: రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమంలో భాగంగా చింతలూరులో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్ నేతృత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలతో పాటు, రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.సువర్చల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఐదిళ్లు దగ్ధం

రూ.8 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని చింతనలంక గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు ఇళ్లు పూర్తిగా, ఒకటి పాక్షికంగా బూడిదయ్యాయి. ఫైర్ ఆఫీసర్ కొండబాబు, స్థానికుల వివరాల మేరకు, చింతనలంక పంట కాలువ లాకుల వద్ద విద్యుత్ స్తంభంపై నుంచి రాజుకున్న నిప్పురవ్వలతో ఇళ్లకు మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో సవరపు సుబ్బారావు, సవరపు నాగూరు, ముమ్మిడివరపు అబ్బులు, ముమ్మిడివరపు పుల్లయ్య, సవరపు సోమరాజు, కొల్లు కనకదుర్గ, సవరపు నాగరత్నానికి చెందిన కుటుంబాలు కట్టుబట్టలతో నిరాశ్రయమయ్యాయి. సిలిండర్లు, గృహోపకరణాలు, వస్త్రాలు, నగదు, బంగారం కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. రూ.8 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీడీఓ భీమారావు, తహసీల్దార్ నాగలక్ష్మమ్మ బాధితులను పరామర్శించారు.

ధరల మంటపై మధ్యాహ్నం వంట

- స్కూళ్లలో భోజన పథకానికి తప్పని సెగ
- చుక్కల్ని తాకుతున్న నిత్యావసర సరకులు
- కూటమి ప్రభుత్వంలో సక్రమంగా మంజూరు కాని బిల్లులు
- మెనూ చార్జీలు పెంచాలని ఎండీఎం నిర్వాహకుల వేడుకోలు



తొండవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

అంబాజీపేట: నిత్యావసర సరకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో కొనుగోలుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఉల్లి, నూనెలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను ప్రభుత్వం అదుపు చేయలేకపోవడంతో ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పెరిగిన నిత్యావసరాల ధరలతో విలవిల్లాడుతున్నారు. మెనూ ప్రకారం భోజనం తయారీకి కూరగాయలు, ఆకుకూరలు. ఉల్లిపాయలు, వంటనూనె కొనలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీల కంటే, నిర్వాహకులకు అవుతున్న ఖర్చు ఎక్కువగా ఉంటోంది. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు నష్టాలను భరిస్తూ విద్యార్థులకు వండి పెడుతున్నారు. మెనూ చార్జీలు పెంచాలని ఎండీఎం నిర్వాహకులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో 757 ప్రభుత్వ పాఠశాలల్లో 52,653 విద్యార్థులు చదువుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 290 స్కూళ్లలో 19,377 విద్యార్థులు, రాజోలులో 229 స్కూళ్లలో 14,529 మంది, కొత్తపేటలో 238 స్కూళ్లలో 18,747 మంది విద్యార్థులు ఉన్నారు.

నాలుగు నెలల బకాయిలు

ధరల మోతతో పాటు, నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు అప్పు చేసి ఏజెన్సీలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఏ నెలకానెల బిల్లులు చెల్లించేవారు. ఇప్పుడు పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది.

పెరగని మెనూ చార్జీలు

ప్రస్తుతం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం



అంబాజీపేటలో మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

మెనూ చార్జీలు ఇలా ఉన్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి రూ.5.88, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.8.57లను ప్రభుత్వం నిర్వాహకులకు చెల్లిస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా, ఇంతవరకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలు పెంచలేదు. పెరిగిన ధరలతో ఏజెన్సీ నిర్వాహకులకు ఖర్చు తడిసిమోపెడవడంతో కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గింది. దీంతో విద్యార్థులకు గతంలో మాదిరిగా పౌష్టికాహారం అందే పరిస్థితి లేదు.

మెనూ ఇలా..

- సోమవారం వేడి పొంగల్, ఉడికించిన కోడి గుడ్డు/కూరగాయల పులావ్, గుడ్డు కూర, వేరు శెనగ చిక్కీ
- మంగళవారం పులిహోర, టమోట పచ్చడి/రాగి జావ, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
- బుధవారం కూరగాయలతో అన్నం, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరు శెనగ చిక్కీ
- గురువారం నిమ్మకాయ పులిహోర, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ
- శుక్రవారం అన్నం. ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ
- శనివారం ఆకుకూర అన్నం. పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ వంటివి

రెండు నెలల బిల్లులు చెల్లించాలి



మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రెండు నెలలుగా చెల్లించాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే, వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. రెండు వారాల్లో బిల్లులు వచ్చే అవకాశం ఉంది.

– కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ–1, అంబాజీపేట

నిర్వహణ భారంగా ఉంది



నిత్యావసర వస్తువులతో పాటు, కాయగూరల ధరలు పెరిగిపోవడంతో మధ్యాహ్న భోజనం మెనూ నిర్వహణ భారంగా ఉంది, ప్రభుత్వం చెల్లిస్తున్న మెనూకి, ప్రస్తుతం ఉన్న ధరలకు ఏమాత్రం పొంతన లేదు. మెనూ చార్జీలు పెంచాలి. నాలుగు నెలల బిల్లులు మంజూరు చేయాలి.

– ఉదత సాయి, ఎండీఎం నిర్వాహకురాలు, అంబాజీపేట

అప్పుల పాలవుతున్నాం



నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే మెనూకి సంబంధం లేకపోవడంతో అప్పుల పాలవుతున్నాం. మా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

– వల్లూరి కరుణ, ఎండీఎం, నిర్వాహకురాలు, అంబాజీపేట

ఇంటి పన్ను ఆన్‌లైన్ వేగవంతం చేయాలి



ఇంటి పన్ను ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్పీఓ

అయినవిల్లి: స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్‌లో ఇంటి పన్ను ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బందికి డీఎల్పీఓ బొజ్జిరాజు ఆదేశించారు. గురువారం వీరవల్లిపాలెం, తొత్తరమూడి గ్రామంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్‌లో ఇంటి పన్ను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటి పన్ను ఆన్‌లైన్ నమోదు 76 శాతం పూర్తి చేసి అయినవిల్లి మండలం డివిజన్ పరిధిలో ముందంజలో ఉందన్నారు. మరింత వేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.భీమరాజు, ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర తదితరులు ఉన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, దీనివల్ల వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు తెలిపారు. మాచవరం సచివాలయం–4 కుమ్మరివీధిలో గురువారం ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకుమారి, ఎంపీహెచ్ఏ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా..



వన సమారాధనలో దీపారాధన చేస్తున్న మహిళలు

కొత్తపేట: కుల, మతాలకతీతంగా స్థానిక న్యూ బ్యాంక్ కాలనీ ప్రాంతంలోని యువకులు ఆధ్వర్యంలో గురువారం కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో వివిధ మతాలకు చెందిన యువకులు సమైక్యంగా వినాయక చవితి, కార్తిక వన సమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలను ఆహ్వానించి అన్న సమారాధనలు జరుపుతున్నారు. గురువారం స్థానిక మహిళలు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అముడ మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఎంపీటీసీ బ్రహ్మానందం, కాపు యువత నాయకుడు సలాది బ్రహ్మాజీ, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, ప్రముఖ న్యాయవాదులు చావలి సుబ్బరాయశాస్త్రి, జి.విజయ తదితరులు పాల్గొన్నారు.

అరటి వర్తకుల వన సమారాధన

అంబాజీపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గురువారం అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో అరటి వర్తకులు, రైతుల ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. తొలుత స్థానిక ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ వన సమారాధన జరిపారు. కార్యక్రమంలో అరటి కాయ వర్తకులు, వ్యాపారులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

మామిడికుదురు: శిథిల స్థితికి చేరిన మామిడికుదురు ఫెూరీ అభివృద్ధితో పాటు, మసీదు వద్ద షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మైనార్టీ నేతలు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ షరీఫ్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో చైర్మన్ షరీఫ్‌ను ఆయన స్వగృహంలో వీరు కలిశారు. మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మైనార్టీ నేతలు సజ్జాద్ హుస్సేన్, ఆబేద్ అలీ, మసూద్ మొహిద్దీన్, ఖాదిర్, అబ్దుల్ మునీర్ తదితరులున్నారు.

రైతులు అప్రమత్తం కావాలి

తుపాను హెచ్చరికపై ఏడీఏ వెంకట రామారావు



రావులపాలెం మండలం దేవరపల్లిలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకట రామారావు



చింతలపల్లిలో ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

కొత్తపేట: బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తం కావాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం వెంకట రామారావు అన్నారు. గురువారం ఆయన వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. వరి ఆయకట్టులను, కోత దశకు వచ్చిన పొలాలను, కోత కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని, మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం కుప్పలు, బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి కోతలు చేపట్టని రైతులు వచ్చే నెల రెండు వరకూ కోతలు వాయిదా వేయాలన్నారు. ఇప్పటికే ఆరబెట్టిన తేమ లేని ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఇంకా ఆరని, ఆయకట్టు లోపల ఉన్న ధాన్యం రాసులు వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తుందన్నారు. కామన్ రకం 75 కేజీలు రూ.1,725, వంద కేజీలు రూ,2,300కు, ఏ గ్రేడ్ రకం 75 కేజీలు రూ.1,740, వంద కేజీలు రూ.2,320కు కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. ధాన్యం మిల్లుకు తరలించిన ఒకటి, రెండు రోజుల్లోనే నగదు రైతుల ఖాతాలకు జమవుతుందన్నారు.

12,764.54 ఎకరాల్లో కోతలు

కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పీ గన్నవరం, అయినవిల్లి, అంబాజీపేట మండలాల్లోని 43,320.37 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, మొత్తం విస్తీర్ణంలో 1,07,727.71 మెట్రిక్ టన్నులు దిగుబడి అంచనా వేసినట్టు ఏడీఏ వెంకట రామారావు విలేకరులకు తెలిపారు. బుధవారం నాటికి 12,764.54 ఎకరాల్లో వరి కోతలు జరిగాయన్నారు. 32,297.057 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి కాగా, దానిలో 680.277 మెట్రిక్ టన్నులు ధాన్యం బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నారని చెప్పారు. పీపీసీల ద్వారా 22,206.120 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించినట్టు తెలిపారు. ఇంకా 9,496.631 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు.

కోతలు వాయిదా వేయాలి

రాజోలు: తుపాను హెచ్చరికలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని చింతలపల్లి, కూనవరం, ములికలిపల్లి, కడలి తదితర ప్రాంతాల్లో వ్యవసాయాధికారులతో కలసి ఆయన పర్యటించారు. వరి కోతలను మూడు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. కోతలు పూర్తయితే ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు, రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఏడీఏ రామ్మోహనరావు, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తదితరులు ఉన్నారు.

సమాజ సంస్కర్త ఫూలే

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- వర్ధంతి సందర్భంగా పలు చోట్ల నివాళులు



మలికిపురంలో ఫూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



విశ్వేశ్వరాయపురంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మహాత్మా జ్యోతీరావు పూలే జీవితం పేదల వర్గాలకు అంకితమని, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు జ్యోతీరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కొనియాడారు. రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మలికిపురం పూలే, అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ పూలే విగ్రహాలకు, మాజీ మంత్రి గొల్లపల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ, సమాజ హితం కోసం జ్యోతీరావు పూలే చేసిన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమన్నారు. కుల వివక్ష నిర్మూలనకు పూలే, అంబేడ్కర్ చేసిన పోరాటాలు మరువలేమన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కుసుమ చంద్రశేఖర్, గెడ్డం తులసి భాస్కర్, చెల్లిబోయిన శ్రీనివాసరావు, కారుపత్తి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నివాళులర్పించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి ప్రదాత

కొత్తపేట: దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహాత్మా జ్యోతీరావు పూలే చరిత్రలో చిరస్మరణీయునిగా నిలిచారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా వాడపాలెంలోని తన స్వగృహంలో పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో పూలే విగ్రహానికి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, ఏపీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. కుల వివక్ష సమాజాన్ని పట్టి పీడిస్తున్న రోజుల్లో పూలే ఆ అసమానతల తొలగింపునకు నడుంకట్టారని కొనియాడారు. పలువురు బీసీ సంక్షేమ సంఘం, బీసీఈఏ నాయకులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు నివాళులర్పించారు. ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు వద్ద పూలే విగ్రహానికి మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుబ్బల సత్తిపండు తదితరులు నివాళులర్పించారు.

విద్యా దాత పూలే

అంబాజీపేట: ఎంతో మంది వెనుకబడిన తరగతులు, ఇతర సామాజిక వర్గాలకు విద్యాదానంతో పాటు, పలు సంస్కరణలు చేసిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

మామిడికుదురు: మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుబ్బల మురళీకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని మామిడికుదురు బాలుర వసతి గృహం ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేతలు నివాళులర్పించారు. అప్పనపల్లిలోని కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి ఫౌండేషన్ కళావేదిక ప్రాంగణంలో పూలే విగ్రహానికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంకిపాటి వెంకటేశ్వరరావు శ్రద్ధాంజలి ఘటించారు. అదే గ్రామంలోని పూలే విగ్రహానికి బీసీ సంఘాల నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు నైనాల రఘురామయ్య, రాయుడు శ్రీనివాస్, రాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మామిడికుదురులో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ ఉద్యోగులు



కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌లో పూలేకు నివాళులర్పిస్తున్న నేతలు

1న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

కొత్తపేట: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ముందుగా వచ్చే నెల ఒకటిన నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు పరీక్ష నిర్వాహకుడు ఆదివారపుపేట వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏడో తరగతిలో 55 శాతం మార్కులు సాధించి, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష ద్వారా స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేస్తారు. వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ సెకండియర్ వరకూ ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు రూ.48 వేలు ప్రోత్సాహంగా అందజేస్తుంది. ఆ మేరకు ఈ ఏడాది డిసెంబర్ 8న ఎన్ఎంఎంఎస్–2024 పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కొత్తపేట మండలంలో పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు బిల్లకుర్రు శివారు కొత్తపాలెం, వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో డిసెంబర్ ఒకటిన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ నమూనా పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 99519 42229 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

మలికిపురం: రాజోలు నియోజకవర్గ పరిధిలో 36 మందికి రూ.34.60 లక్షల సీఎం సహాయ నిధులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను గురువారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లబ్ధిదారులకు అందించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో ఉన్న పార్వతి వీరేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి కేశవస్వామి వార్ల ఆలయం వద్ద స్వామి వార్లకు లక్ష బిల్వార్చన గురువారం నిర్వహించారు. స్థానిక శెట్టిబలిజ సంఘీయుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యనారాయణశర్మ, సుదర్శన కేశవాచార్యులు స్వామి వార్లకు లక్ష బిల్వార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరిగింది. అలాగే మాచవరం రాజరాజేశ్వరి, కందుల మల్లేశ్వరస్వామి ఆలయంలోను, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మొసలపల్లి, వాకలగరువు, కె.పెదపూడి, ముక్కామల, ఇరుసుమండ, మాచవరం, గంగలకుర్రు, నందంపూడి, తొండవరం గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో స్వామి వార్లకు లక్ష బిల్వార్చన కార్యక్రమాలు జరిగాయి.

సంక్షిప్తంగా..

మద్యం విక్రేతల అరెస్ట్

ఆలమూరు: మండపేట, ఆలమూరు మండలాల్లో గురువారం జరిగిన దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం చెముడులంకలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడి చేసి ఎస్.మల్లయ్యను అరెస్ట్ చేసి, 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ద్వారపూడిలో మట్టా వెంకటలక్ష్మి, కేశవరంలో గండిమేని త్రివేణి అనే సారా విక్రేతలను అరెస్ట్ చేశారు. పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

పథకాల్లో ఎస్సీ, బీసీలకు అన్యాయం

మలికిపురం: ప్రభుత్వ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల్లో చోటామోటా నాయకుల మొదలు ఎమ్మెల్యే ల వరకు నిబంధనలను ఉల్లంఘించి, తమ అనుచరులకు లబ్ధి చేకూర్చాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రావులపాలెం: ఈతకోట హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కేవీకే రాజు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రోత్సాహక ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో, టెస్ట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీటిని అందించారు.

పశువులకు టీకాలు

రావులపాలెం: పొడగట్లపల్లి పశు వైద్యశాలలో గురువారం పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశు వైద్యాధికారి ఎం.రామారావు ఆధ్వర్యంలో సుమారు 34 ఆవు, గేదెలకు టీకాలు వేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

మామిడికుదురు: ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ అన్నారు. సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా గురువారం మొగలికుదురు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై కృష్ణ, ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అయ్యప్ప పడిపూజ

ఆలమూరు: స్వామి శరణుఘోషతో స్థానిక శ్రీనివాస నగర్‌లో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ భక్తులను ఆకట్టుకుంది. స్థానిక మెయిన్ రోడ్డు సమీపంలో ఆధ్యాత్మిక అయ్యప్ప స్వామి ప్రాంగణంలో అరటి డొప్పలు, పువ్వులు, పండ్లతో వేదికను సుందరంగా రూపొందించారు. స్వామి వారికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.